సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 12 । జనవరి । 2024



ఘనంగా ధారోత్సవాలు

సింహాచలం సింహగిరిపై ఐదురోజులపాటు జరిగే ధారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

8లో



'ఆవ'లో జాగ్రత్త సుమా

వాడ్రాపల్లి ఆవలో బోటు రవాణా. చేపల పట్టే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ సత్యనారాయణ సూచించారు.

8లో



శాస్త్రోక్తంగా చండీ హోమం

విశాఖ నగరంలోని పోలమాంబ ఆలయంలో గురువారం చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

8లో

న్యూస్‌రీల్

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కొండా రాజీవ్



సాక్షి, విశాఖపట్నం: విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కొండా రాజీవ్ గాంధీ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ తనని ఈ పదవిలో నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాజీవ్ గాంధీ వైఎస్సార్ సీపీలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. ప్రస్తుతం పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

దుర్గాభవాని కుటుంబాన్ని ఆదుకుంటాం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది : గత నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 86వ వార్డు కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన వలంటీర్ కె.దుర్గాభవాని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం ఎండాడలో గల జిల్లా పార్టీ కార్యాలయంలో లక్ష రూపాయల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, పార్టీ నాయకుడు జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి

గంగవరం: ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని పెద్దాపురం పతాంజలి ఫుడ్స్ డీజీఎం ఏఎస్ ప్రకాష్ అన్నారు. గురువారం మండలంలోని మొల్లేరులో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందించే రాయితీలు, యాజమాన్య పద్ధతులు, బిందు సేద్యం, ఎరువుల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాము అర్జున, అర్జునరావు, గంగవరం, మొల్లేరు, మల్లవరం ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి



వ్యూపాయింట్ వద్ద ఫొటోలు దిగుతున్న పర్యాటకులు

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ ముఖద్వారం, ఘాట్‌రోడ్డు, వ్యూపాయింట్ ప్రాంతాల్లో గురువారం పర్యాటకులు సందడి చేశారు. అరకులోయ అందాలను తిలకించేందుకు కుటుంబ సమేతంగా తరలి వచ్చారు. సహజసిద్ధమైన ప్రకృతి అందాలను ఆస్వాదించారు. సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు తెలిపాయి.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

- రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన ప్రసాద్



పతకం అందుకుంటున్న కుర్తాడి ప్రసాద్

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ జర్రిపడ గ్రామానికి చెందిన కుర్తాడి ప్రసాద్ విశాఖలో జరిగిన అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 6,7 తేదీల్లో విశాఖ జిల్లాలోని రైల్వే న్యూకాలనీ గ్రౌండ్‌లో 41వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2024 పోటీల్లో సత్తా చాటారు. 1500,800 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 200 మీటర్లలో తృతీయస్థానంలో నిలిచి పతకాలు సాధించారు. జాతీయస్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. ఆయనను మండల ప్రజలు అభినందించారు.

మన్యం సంతలకు సంక్రాంతి శోభ

- జోరుగా ఏజెన్సీ ఉత్పత్తుల విక్రయాలు
- భారీగా వ్యాపారం



విక్రయానికి తీసుకువచ్చిన రాజ్‌మా



గుత్తులపుట్టు వారపు సంతకు భారీగా తరలి వచ్చిన గిరిజనులు

సాక్షి,పాడేరు: మన్యంలోని గిరిజన వారపుసంతలకు సంక్రాంతి శోభ నెలకొంది. గత వారం రోజుల నుంచి ఏజెన్సీ ఉత్పత్తుల కొనుగోళ్లతో రద్దీగా నెలకొంది. వారపుసంతలే గిరిజన ప్రాంత ప్రజలకు షాపింగ్ మాల్స్ కావడంతో అన్ని సంతల్లోను వ్యాపార లావాదేవీలు భారీగా జరుగుతున్నాయి. వ్యవసాయ, వాణిజ్య పంటల ఉత్పత్తులను సంతల్లో విక్రయించగా వచ్చిన నగదుతో ఇంటిల్లపాదికి అవసరమైన కొత్త దుస్తులు, ఇతర సామాగ్రి కొనుగోలు చేస్తున్నారు.

గుత్తులపుట్టు, మద్దిగరువులో..

పాడేరు మండలంలోని గుత్తులపుట్టు, జి.మాడుగుల మండలంలోని మారుమూల మద్దిగరువు వారపుసంతల్లో గురువారం భారీగా వ్యాపారం జరిగింది. గిరిజన రైతులు సాగుచేసిన రాజ్‌మా, కాఫీ గింజలు, పసుపు, పిప్పళ్లను సంతలకు తీసుకువచ్చి విక్రయించారు. గిట్టుబాటు ధరలు లభించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. సుమారు రూ.2 కోట్ల మేర లావాదేవీలు జరిగాయి. నాటుకోళ్ల ధరలు భారీగా పెరిగాయి. సుమారు కిలో బరువు గల కోడిని రూ.వెయ్యికి విక్రయించారు.

జోరుగా దుస్తుల వ్యాపారం

పాడేరు మండలం గుత్తులపుట్టు వారపుసంతకు పాడేరు, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల గిరిజనులు భారీగా తరలి వచ్చారు. జి.మాడుగుల మండలం మద్దిగరువు సంతకు జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, సరిహద్దు ఒడిశాలోని గిరిజనులు కుటుంబ సమేతంగా తరలిరావడంతో రద్దీ నెలకొంది. రెడీమేడ్‌తోపాటు అన్ని రకాల దుస్తులను కొనుగోలు చేశారు. సుమారు రూ.కోటి మేర దుస్తుల వ్యాపారం జరిగింది. నిత్యావసర సామగ్రిని కొనుగోలు చేశారు.

గుత్తులపుట్టు వారపు సంతలో గిరిజన తుడుము,ఇతర డప్పు వాయిద్యాల అమ్మకాలు జోరుగా జరిగాయి. ఒడిశాలోని పాడువా ప్రాంతంలో తయారు చేసిన తుడుములు,ఇతర డప్పులను విక్రయించారు. వాయిద్య పరికరాల్లో తుడుము రూ.2 వేలు, చిన్న తుడుము రూ.వెయ్యి, డప్పు రూ.వెయ్యి చొప్పున కొనుగోలు చేశారు.



గుత్తులపుట్టు సంతలో గిరిజన వాయిద్య పరికరాలు



జోరుగా నాటుకోళ్ల అమ్మకాలు



గుత్తులపుట్టు సంతలో దుస్తుల దుకాణం వద్ద రద్దీ



గుత్తులపుట్టులో వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

7862 మందికి 'జగనన్న తోడు' లబ్ధి

- రూ.8కోట్ల 31లక్షల 86వేలు బ్యాంకు ఖాతాల్లో జమ
- కలెక్టర్ సుమిత్‌కుమార్



జగనన్న తోడు నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: జగనన్న తోడు పథకంలో జిల్లాలోని 7,862 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం మంజూరు చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న తోడు ఎనిమిదవ విడత ఆర్థిక సాయం పంపిణీ, వడ్డీ సొమ్ము విడుదల కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టర్‌తో పాటు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఇతర లబ్ధిదారులంతా సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో వీక్షించారు. అనంతరం జిల్లాలోని 7862మంది లబ్ధిదారులకు రూ.8కోట్ల 31లక్షల 86వేల విలువైన నమూనా చెక్కును కలెక్టర్,పాడేరు ఎమ్మెల్యేలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో రూ.10వేల రుణం పొందిన 3,910మంది సంప్రదాయ చేతివృత్తిదారులకు రూ.7లక్షల 41వేల 952 వడ్డీ సొమ్మును ప్రభుత్వం విడుదలచేసిందన్నారు. జగనన్న తోడు ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోని చిరువ్యాపారాల్లో మంచి ఫలితాలు సాధించాని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ ఈఈ లావణ్యకుమార్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు విధిగా తనిఖీ

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారులు విధిగా తనిఖీ చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మండల పరిధిలోని సెక్టోరల్ అధికారులకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు, పోలీసు అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని సూచించారు. గతంలో పోలింగ్ సందర్భంగా ఏమైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే వాటిపై నివేదించాలని ఆదేశించారు. సెక్టోరల్ అధికారుల విధులపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతకు విఘాతం కలిగించే వారిని ముందుగానే గుర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు రహదారి సౌకర్యం అనువుగా ఉన్నదదీ లేనిది పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత సెక్టోరల్ అధికారులపై ఉందన్నారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఏటీడీబ్ల్యూవో రజని పాల్గొన్నారు.

అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదిక అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలోని 59 మంది సెక్టోరల్ అధికారులతో ఆయన రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కె. చైతన్యతో కలిసి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. అన్ని మండలాల్లోని బూత్ స్థాయి అధికారులు, రూట్ అధికారులు, సెక్టోరల్ అధికారులు పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు సందర్శించాలని సూచించారు. సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫారం 6,7,8లు పరిష్కరించాలని ఆదేశించారు.

ఈఈ జి డేవిడ్‌రాజు, డీఈ చైతన్య, రాజేంద్రబాబు, ఏటీడబ్ల్యూవో రామతులసి, ఎన్నికల డీటీ ఎస్‌వీవీ సత్యనారాయణ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పీవీటీజీ గిరిజనులతో ప్రధానమంత్రి ముఖాముఖి

- ఈనెల 15న వర్చువల్ విధానంలో సంభాషణ
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



హాజరైన వివిధ శాఖల అధికారులు

అరకులోయ రూరల్: ఈనెల 15న పీవీటీజీ గిరిజనులతో ప్రధాన మంత్రి నరేంద్రమోది వర్చువల్ విధానంలో సంభాషిస్తారని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. మండలంలో కొత్తభల్లుగుడ ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహ అభియాన్ పథకం నిర్వహణపై గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పీవీటీజీ గిరిజనులకు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ విషయంలో అధికారులకు కేటాయించిన పనులను సమర్థంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన పీవీటీజీ గిరిజనులందరికి ఆయుష్మాన్ భారత్ కార్డు, ఆధార్ కార్డు, ప్రధాన మంత్రి జన్ మన్ గృహాలు, విద్యుత్, తాగునీరు, సౌకర్యం కల్పిస్తుందన్నారు. కొత్తభల్లుగుడలో సభ నిర్వహించనున్న స్థలంలో పనులను పరిశీలించారు. అధికారులకు సూచనలిచ్చారు. ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు



నేరస్తుడితో పోలీసులు (మధ్యలో వ్యక్తి)

రాజవొమ్మంగి: హత్య కేసులో నిందితునికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు జడ్డంగి ఎస్‌ఐ రఘునాథరావు తెలిపారు. మండలంలోని కొమరాంపురంలో 2021లో స్థల వివాదానికి సంబంధించి తమ్ముడు తాతారావును అన్న మార్తి వెంకటేశ్వర్లు తలపై కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటనలో తాతారావు మృతి చెందడంతో పోలీసులు అప్పటిలో కేసు నమోదు చేసి నిందితుడు వెంకటేశ్వర్లును అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి రాజమహేంద్రవరం 9వ అడిషనల్ కోర్టు న్యాయమూర్తి ఎం.మాధురి ఏడేళ్ల జైలు విధిస్తూ తీర్పు చెప్పినట్టు ఎస్ఐ తెలిపారు. ఇలావుండగా హత్య కేసులో అరెస్టయిన వెంకటేశ్వర్లు బెయిల్‌పై వచ్చిన నాటి నుంచి విచారణకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతుండగా పట్టుకుని కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ మేరకు న్యాయమూర్తి శిక్ష విధించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

అల్లిగూడెంలో పోలీసు ఔట్‌పోస్టు?

చింతూరు: మండలంలోని అల్లిగూడెంలో పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు రాష్ట్రంలోనే పోలీసు ఔట్‌పోస్టు చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లిలో మాత్రమే ఉంది. తాజాగా దానికి సమీపంలోని అల్లిగూడెంలో మరో ఔట్‌పోస్టు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దండకారణ్యం పరిధిలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దులకు సమీపంలో వుండే ఈ ప్రాంతంలో గతంలో మావోయిస్టులకు గట్టిపట్టు ఉండేది. ఈ నేపథ్యంలో అల్లిగూడెంకు సమీపంలోని మల్లంపేటలో గతంలో ఔట్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఆ తరువాత దానిని తొలగించి ఏడుగురాళ్లపల్లిలో ఏర్పాటుచేశారు.ఛత్తీస్‌గఢ్ నుంచి ఆంధ్రాలోకి మావోయిస్టుల చొరబాట్లను నిరోధించడానికే ఈ ఔట్‌పోస్టును ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ అమల

చింతూరు: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చింతూరులో రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంటును ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ మన్యంలోని క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలను సద్వినియోగం చేసుకుని ఆదివాసీ యువత మున్ముందు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటాలని ఆయన ఆకాంక్షించారు. రెండ్రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో తెలంగాణకు చెందిన డోర్నకల్, భద్రాచలం, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కుంట, ఒడిశాకు చెందిన పొడియా, ఆంధ్రాకు చెందిన కాకినాడ, రాజమండ్రి, చింతూరు జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడమ అర్జున్, ఎంపీటీసీ సభ్యుడు వేకా రాజ్‌కుమార్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పూనెం కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చ





సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు, మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో పోలినాయుడు

మహారాణిపేట (విశాఖ): సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమివ్వాలని, సామాన్య ప్రజల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆమె అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. వీటిలో అభివృద్ధి పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, సంక్షేమం, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తగా ఆయా శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఇప్పటి వరకు తీసుకున్న, చేపట్టనున్న చర్యలను వివరించారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పని చేస్తున్న వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు. మైదాన ప్రాంతాల్లో మాదిరిగా పాడేరు, అరకు ప్రాంతాల్లో కూడా మహిళా మార్ట్‌లను ప్రారంభించాలని డీఆర్డీఏ పీడీకి సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో మరింత నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తూ పూడిక తొలగింపు, కాలువలు శుభ్రత చేపట్టాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని చెప్పారు. కొన్ని మండలాల్లో దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది పనితీరు బాగోలేదని సభ్యులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవోను ఆదేశించారు. సభ్యుల సూచన మేరకు బెల్టు షాపులపై దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. మినీ గోకులాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

వారంలో బిల్లుల మంజూరు

15వ ఆర్థిక సంఘం కాల పరిధిలో చేపట్టే పనులకు వారం రోజుల్లోపే బిల్లులు మంజూరు చేస్తామని జెడ్పీ సీఈవో ఎం. పోలినాయుడు తెలిపారు. ఆయా పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరారు. ప్రారంభ, మధ్యస్థ పనులకు సంబంధించి వేర్వేరుగా ఎం.బుక్‌లు సమర్పించినా బిల్లులు మంజూరు చేస్తామని వెల్లడించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్ విభాగాల్లో చేపట్టే పనులకు అధిక ప్రాధాన్యం ఉంటుందని ఆయన చెప్పారు.

ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులు తక్షణం చెల్లించాలని పలువురు సభ్యులు కోరారు. చాలా కాలం నుంచి ఈ బిల్లులు రాలేదని, అలాగే కాంపోనెట్ కూడా విడుదల కాలేదని అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు, గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నాడు–నేడు పనులకు తక్షణం బిల్లులు మంజూరు చేయాలని పలువురు జెడ్పీటీసీలు కోరారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్‌బిల్డింగ్(సెమ్స్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణ శివం తెలిపారు. అభ్యర్థులు 27 ఏళ్ల లోపు వయస్సు కలిగి పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డిప్లమో ఇన్ మెకానికల్, ఎలక్ట్రికల్‌లో ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేశారు. విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల(వన్‌టౌన్, కోట వీధి, పాత పోస్టాఫీస్, జాలారిపేట, అల్లిపురం, కొబ్బరితోట, మహారాణిపేట, పందిమెట్ట, జ్ఞానాపురం, 75 ఫీట్ రోడ్, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ, గొల్లవీధి) పరిధిలోని నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. కొరియర్ సూపర్‌వైజర్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, పిక్కర్, ఇన్వెంటరీ కంట్రోలర్, సీఎన్‌సీ ఆపరేటర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో 3 నెలల ఉచిత శిక్షణతో పాటు ఉపాధి సహకారం అందిస్తామన్నారు. అభ్యర్థులు 9948183865, 7794840934, 0891–2704010 నెంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

నేడు పాడేరు ఐటీడీఏలో జగనన్నకు చెబుదాం

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ సమావేశమందిరం లో ఈనెల 12వతేదీ శుక్రవారం జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ప్రజలు వ్యక్తిగత,గ్రామాల సమస్యలపై వినతులు అందజేయాలని కోరారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమానికి అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

17 మందిపై బైండోవర్

రాజవొమ్మంగి: జడ్డంగి స్టేషన్ పరిధిలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో గురువారం 17 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. వీరిపై గతంలో కోడిపందాలు, జూదం, సారా విక్రయాల్లో కేసులు నమోదైనట్టు చెప్పారు. మరోసారి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా కౌన్సిలింగ్ ఇచ్చి పూచీకత్తుపై విడిచిపెట్టామన్నారు.

'ఆవ'లో జాగ్రత్త సుమా

అచ్యుతాపురం : కొండకర్ల–వాడ్రాపల్లి ఆవలో చేపట్టే బోటు రవాణాతో పాటు, చేపలను పట్టే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ సూచించారు. గురువారం కొండకర్ల ఆవ ఒడ్డున స్థానిక మత్స్యకారులతో మాట్లాడారు. ఆవలో బోటు నడిపే మత్స్యకారులు, పూలు, చేపల కోసం ఆవలో బోటులో వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొండకర్ల ఆవ పరిధిలో ఉన్న ప్రైవేట్ రిసార్టులను డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు పరిశీలించి తగిన సూచనలు జారీ చేశారు. సీఐ బుచ్చిరాజు, మునగపాక ఎస్ఐ మహ్మద్ అలీ పాల్గొన్నారు.

ఘనంగా ధారోత్సవాలు

సింహాచలం : సింహగిరిపై గురువారం నుంచి ధారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో వేంజేంపజేసి ఆలయంలో నుంచి తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారిని వేంజేంపజేసి గంగధార జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అక్కడే ఉన్న పురాతన మండపంలో అమ్మవారిని వేంజేంపజేశారు. విశేష ఆరాధన, తిరుప్పావై సేవాకాలాన్ని నిర్వహించారు. పాశుర విన్నప పారాయణాన్ని విశేషంగా పఠించారు. అనంతరం అమ్మవారిని పల్లకిలో వేంజేంపచేసి ఆలయంలోకి తీసుకెళ్లి బేడా మండపంలో తిరువీధిని నిర్వంచారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

శివారు గ్రామాల అభివృద్ధికి కృషి

ఓఎస్డీ మహేశ్వరరెడ్డి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్‌మీనా



విజేత జట్టుకు ట్రోఫీ, నగదు చెక్కును అందచేస్తున్న ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు: ఏజన్సీలోని మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి పోలీసుశాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తోందని రంపచోడవరం ఓఎస్డీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. చింతూరు మండలం అల్లిగూడెంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలు, ఉచిత వైద్యశిబిరాన్ని చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనాతో కలసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓఎస్డీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రావీణ్యాన్ని ఇలాంటి పోటీల ద్వారా వారు తమ ప్రతిభను చాటుకునే అవకాశముందన్నారు. గ్రామాల్లో సరైన అవగాహన లేక ఎంతోమంది వ్యాధుల బారిన పడుతున్నారని, అలాంటి వారి కోసం ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ మేరకు మల్లంపేట నుండి ఏడుగురాళ్లపల్లి వరకు, పేగ నుంచి దొంగలజగ్గారం వరకు ఉన్న తారురోడ్డుకు మరమ్మతులు చేయించినట్టు తెలిపారు. గతంలో నిలిచిపోయిన భద్రాచలం, మల్లంపేట బస్సు సర్వీసు త్వరలోనే పునఃప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అల్లిగూడెం గ్రామస్తుల కోసం పోలీసుశాఖ ఆధ్వర్యంలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలకు విద్యుత్ సౌకర్యంతో పాటు ఈ ప్రాంత ఆదివాసీల కోసం అల్లిగూడెంలో పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 360 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. విజేతలకు బహుమతులు: గురువారం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పురుషుల విభాగంలో 40 జట్లు పాల్గొనగా అల్లిగూడెం ప్రథమ, నారకొండ ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. మహిళల విభాగంలో ఆరు జట్లు పాల్గొనగా అల్లిగూడెం ప్రథమ, సూరకుంట ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. విజేతలకు ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్‌మీనా, సీఆర్పీఎఫ్ కమాండెంట్ సురేష్‌కుమార్ బహుమతులను అందచేశారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లు, వివిధ గ్రామాలకు చెందిన వారికి రగ్గులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో చింతూరు సీఐ గజేంద్రకుమార్, రంపచోడవరం సీఐ వెంకటేశ్వరరావు, రాజవొమ్మంగి సీఐ స్వామినాయుడు, ఎస్ఐలు శ్రీనివాసరావు, శివకుమార్, గోపాలరావు, యాదగిరి, వైద్యులు శేషిరెడ్డి, శ్రీహర్ష, విశ్వచైతన్య, శశికళాదేవి, ఎంపీటీసీ సభ్యుడు సున్నం నాగరాజు, సర్పంచ్ పాయం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మేలుకో శ్రీరామా...

- భక్తి శ్రద్ధలతో మేలుకొలుపులు
- ఆదర్శంగా మునగపాక పల్లపువీధి వినాయక కమిటీ
- ఆధ్యాత్మిక సేవలు



మునగపాక సాయిబాబా ఆలయంలో భజనలు



గౌరీపరమేశ్వరుల ఆలయంలో భజనలు

మునగపాక : ఈ గ్రామం ఉద్యమాలకే కాదు... ప్రజల్లో భక్తి భావాలను పెంచడంలోనూ ముందుంటుంది. ఏ కార్యక్రమం తలపెట్టినా అంకితభావంతో పనిచేయడం ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష. పిల్లల నుంచి యువకులు, పెద్దలు తాము చేపట్టిన కార్యక్రమం విజయవంతం చేయడంలో కృషి చేస్తారు. ఆ గ్రామం పేరు మునగపాక. ధనుర్మాసం వచ్చిందంటే చాలు మునగపాకలోని పల్లపు వీధి వినాయక ఆలయ ప్రాంగణంలో యువకులు మేలుకొలుపులకు ప్రాధాన్యం ఇస్తారు. నెల రోజుల పాటు మేలుకొలుపుల కార్యక్రమం నిర్వహించడం అనాదిగా వస్తుంది. 1952 నుంచి అప్పటి పెద్దలు శివకోటి సాంబశివరావు తదితరులు పది మందితో కలసి మేలు కొలుపుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. క్రమేణా 75 మందికి పైగా పిల్లలు, యువకులు మేలుకొలుపుల కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రతిరోజూ ఉదయం 4.30 గంటలకు భక్తులంతా చన్నీటి స్నానమాచరించి శివపార్వతుల చిత్రపటంతో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహిస్తున్నారు. పల్లపు వీధిలోని వినాయక గుడి నుంచి ప్రారంభమయ్యే మేలుకొలుపు సాంబశివుని ఆలయం, సంతబయిల వినాయక గుడి, రామాలయం, పంచాయతీ వీధిలోని రామాలయం, గౌరీ పరమేశ్వరుల ఆలయం, నందీశ్వర ఆలయం, సాయిబాబా ఆలయం, మెయిన్‌రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయాలకు భజనలు చేసుకుంటూ దేవతామూర్తులను నిద్రలేపుతారు. చివరలో వినాయకుని గుడి వద్ద అల్పాహారం తీసుకొని ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోతారు. నెలరోజుల పాటు నిర్వహించే మేలుకొలుపులో భాగంగా భోగిపండగ రోజున వినాయక గుడి ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా మేలుకొలుపు కార్యక్రమం దిగ్విజయంగా ముగుస్తుంది.

యువకుని అనుమానాస్పద మృతి



మృతుడు పత్తి ప్రశాంత్

చోడవరం రూరల్: ఇరవై నాలుగేళ్ల యువకుడు ఒక ప్రైవేటు భవనం కిటికీ ఇనుప గ్రిల్‌కు ఉరివేయబడి విగతజీవిగా ఉన్న సంఘటన గురవారం చోడవరంలో కలకలం రేపింది. చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా ఒక కూరగాయల దుకాణంలో పనిచేస్తున్న బుచ్చియ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన పత్తి ప్రశాంత్ (24) గాంధీ గ్రామం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ప్రాంతంలో ఉన్న ఒక ప్రైవేటు భవనం ఇంటి బయటవైపు ఇనుప కిటికీ గ్రిల్‌కు లుంగీపంచెతో మెడకు ఉరివేయబడి వేలాడుతుండడాన్ని చూసిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేలకు అందినంత మేరలో ఉరివేయబడి ఉండడంతో అతనిది ఆత్మహత్యా, హత్యా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడు బుధవారం సాయంత్రం అనకాపల్లి మార్కెట్‌కు వెళ్లి వచ్చి చోడవరంలో ఉండిపోయాడు. ఆ రాత్రి తన తల్లి పార్వతమ్మతో ఫోన్ ద్వారా మాట్లాడాడు. ఉదయానికి విగతజీవిగా కనిపించేసరికి తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్లు తల్లడిల్లారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్ఐ బి.అప్పలనాయుడులతో పాటు సంఘటన అనుమానాస్పదంగా ఉండడంతో అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు సంఘటన స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్‌ను, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వివరాలు సేకరిస్తున్నారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం

ఏయూ క్యాంపస్ (విశాఖ): స్థానిక పోలమాంబ ఆలయంలో గురువారం ఉదయం చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతి నెలా మంగళవారం, శుక్రవారం, పౌర్ణమి, అమావాస్య రోజుల్లో భక్తుల సమక్షంలో చండీ హోమం నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు స్వయంగా పాల్గొని తమ స్వహస్తాలతో హోమం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.గాయత్రి పర్యవేక్షించగా, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. హోమంలో పాల్గొనదలిచే భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

కూడార్లై కనువిందు





వజ్ర కవచాలంకృతులుగా ధ్యాన వేంకటేశ్వరస్వామి, ఆండాళమ్మ అలంకారాలు

కశింకోట: కశింకోటలోని దేవదాయ, ధర్మదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం 'కూడార్లై' ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గోదాదేవిని వివాహం చేసుకోవడానికి రంగనాథుడు అంగీకారం తెలిపిన రోజుగా ధనుర్మాసోత్సవాల్లో జరిపే ఈ వేడుక కనువిందు చేసింది. స్వామి మూల విరాట్‌ను అందంగా పూలమాలలతో అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. తిరుప్పావై, పాశుర విన్నపం పారాయణం చేశారు. ఆండాళమ్మ గోదాదేవి, వేణుగోపాలస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూడార్లైను పురస్కరించుకొని సంప్రదాయంగా డ్రై ఫ్రూట్స్ వినియోగించి బెల్లం, పంచదారలతో వేర్వేరుగా పెద్ద అండాలతో పాయసాన్ని తయారు చేసి స్వామికి నివేదించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, ఆలయ అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూల విగ్రహాన్ని వజ్ర కవచాలంకృతులను చేసి విష్ణు సహస్ర నామార్చనలు, పాశుర విన్నపం, తిరుప్పావై నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

వైభవంగా సహస్ర ఘటాభిషేకం

- కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు
- ముగిసిన మార్గశిర మాసోత్సవాలు



సహస్ర ఘటాభిషేకం కోసం ఆలయ ప్రాంగణంలో సిద్ధం చేసిన కలశాలు

డాబాగార్డెన్స్: విశాఖవాసుల ఆరాధ్య దైవం కనక మహాలక్ష్మి అమ్మ వారి సన్నిధిలో మార్గశిర మాసోత్సవాలు గురువారంతో వైభవంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా సహస్ర ఘటాభిషేకాన్ని కనులపండువగా జరిపించారు. నెల రోజుల పాటు జరిగిన ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే గాక రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. చివరి రోజైన గురువారం అమ్మవారికి యథావిధిగా శ్రీచక్ర నవవర్ణార్చన, లక్ష్మీహోమం, సామూహిక అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు ఆలయ ప్రాంగణంలో సహస్ర ఘటాభిషేకం నేత్రపర్వంగా జరిపించారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారి దర్శనాలు నిలిపివేశారు. అభిషేకం అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి మాజీ చైర్‌పర్సన్, ఉత్సవ కమిటీ సభ్యురాలు కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

మార్గశిర మాసోత్సవాల ముగింపు సందర్భంగా 20 వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయ మెయిన్‌రోడ్డు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అమ్మవారి మాల విరమణ

కనకమహాలక్ష్మి మాల ధరించిన భక్తులు దీక్ష విరమణ చేశారు. మహా పూర్ణాహుతి సమర్పించిన అనంతరం మాలను విసర్జించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మాలధారులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతి స్పెషల్స్

తాటిచెట్లపాలెం: సంక్రాంతి సందర్భంగా పలు స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. శ్రీకాకుళం రోడ్–హైదరాబాద్(07179) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ జనవరి 13వ తేదీ శనివారం సాయంత్రం శ్రీకాకుళం రోడ్‌లో సాయంత్రం 5.30గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.18గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి రాత్రి 8.20గంటలకు బయల్దేరి మరుసటిరోజు దయం 9.15గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. విశాఖ–గుంటూరు(08591) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం 8.20గంటలకు విశాఖలో బయల్దేరి అదేరోజు సాయంత్రం 3గంటలకు గుంటూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గుంటూరు–విశాఖ (08592) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ అదేరోజు సాయంత్రం 5గంటలకు గుంటూరులో బయల్దేరి రాత్రి 11.50గంటలకు విశాఖ చేరుకుంటుంది. శనివారం విశాఖలో బయల్దేరే విశాఖ–విజయవాడ (22701) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ గుంటూరు వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో శనివారం విజయవాడలో బయల్దేరే విజయవాడ– విశాఖ(22702) గుంటూరు వరకు పొడిగించారు. విశాఖ–గుంటూరు(22701) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ విశాఖలో ఉదయం 5.20గంటలకు బయల్దేరి అదేరోజు ఉదయం 11.25గంటలకు విజయవాడ చేరుకుని, అక్కడ నుంచి 11.35గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1 గంటకు గుంటూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గుంటూరు–విశాఖ (22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ గుంటూరులో మధ్యాహ్నం 4గంటలకు బయల్దేరి సాయంత్రం 5.05గంటలకు విజయవాడ చేరుకుని, అక్కడ నుంచి 5.15గంటలకు బయల్దేరి రాత్రి 10.55 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

సారా బట్టీలపై దాడులు

ఐదుగురి అరెస్టు



సారాతో పట్టుబడిన వ్యక్తితో పోలీసులు

హుకుంపేట: మండలంలోని పట్టం గ్రామంలో సారాపై దాడులు నిర్వహించడంతో 16 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పట్టం గ్రామంలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం మేరకు గురువారం గ్రామంలో తమ సిబ్బందితో దాడులు నిర్వహించి, 16 లీటర్ల సారాను స్వాధీనం చేసినట్టు తెలిపారు. సారా విక్రయిస్తున్న తాంగుల మోహన్‌దాస్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు చెప్పారు.

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు ప్రాంతం లోదొడ్డి సమీపంలో నిర్వహిస్తున్న సారాబట్టీపై దాడి జరిపి ఒకరిని గురువారం అరెస్టు చేసినట్లు జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు సారా బట్టిపై దాడి జరుపగా అక్కడ 10 లీటర్ల సారాతో లోదొడ్డి గ్రామానికి చెందిన శ్రీనుబాబు అనే వ్యక్తి పట్టుబడ్డాడన్నారు. సారా తయారీకు సిద్ధంగా ఉన్న 100 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. ముద్దాయిని రంపచోడవరం జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.



సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు, సిబ్బంది

కోటవురట్ల : మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం పోలీసులు దాడులు నిర్వహించి 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 300 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం చినబొడ్డేపల్లి శివారు కె.కొత్తూరులో రాళ్ల తల్లి అనే వ్యక్తిని అరెస్టు చేసి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో నీలిగుంట గ్రామ శివారున కన్నంరెడ్డి నానిబాబు, కన్నంరెడ్డి శ్రీను అనే ఇద్దరు వ్యక్తులు సారా తయారు చేస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 300 లీటర్ల బెల్లం పులుపును, తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. ముగ్గురినీ అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



బెల్లం పులుపును ధ్వంసం చేసిన పోలీసులు

కొత్తభూమిలో...

కె.కోటపాడు : శృంగవరం శివారు కొత్తభూమి గ్రామంలో సారా తయారీ కేంద్రాలపై ఎ.కోడూరు పోలీసులు గురువారం దాడులను జరిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎ.కోడూరు ఎస్ఐ జె.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామ శివార్లలో తనిఖీలను జరిపారు. ఈ తనిఖీలలో డ్రమ్ములలో సారా తయారీకి సిద్ధంగా నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లం పులుపును గుర్తించి పోలీసులు ధ్వంసం చేసారు. సంఘటనా స్థలంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన వంట పాత్రలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు ఎస్.ఐ రమేష్ తెలిపారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది రాము, శ్రీను పాల్గొన్నారు.

4వేల లీటర్ల పులుపు ధ్వంసం

నాతవరం : గుట్టు చప్పుడు కాకుండా సారా తయారీకి నిల్వ చేసిన 4వేల లీటర్ల పులుపును ధ్వంసం చేశామని నాతవరం ఎస్ఐ రామారావు అన్నారు. వెదురుపల్లి, కె.వి.శరభవరం గ్రామాల సరిహద్దులో సారా తయారు చేస్తున్న బట్టీలపై బుధవారం పోలీసులు దాడి చేశారు. పట్టుబడిన పులుపును సంఘటన స్థలంలోనే ధ్వంసం చేశామని, నిర్వాహకులు పరారయ్యారని ఎస్ఐ తెలిపారు. సారా తయారీకి ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మండల వ్యాప్తంగా సారా తయారీ విక్రయాలు చేసే 15మందిపై కేసు నమోదు చేశామన్నారు. సారా తయారీ చేసే గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామని అన్నారు. ఎక్కడైనా సారా తయారీ విక్రయాలు చేస్తున్నట్టుగా తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



కుముందానిపేట శివార్లలో పులుపు, నిల్వ చేసే డ్రమ్ములతో కొత్తకోట పోలీసులు



సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఎస్ఐ రామారావు

రావికమతం : కొత్తకోట సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో కలిసి గురువారం కుముందానిపేట గ్రామ శివారు తోటల్లో దాడులు చేశారు. ముందస్తు సమాచారంతో ఆ గ్రామ శివారు తోటల్లో దాడులు చేసి, సారా తయారీకి సిద్ధంగా ఉన్న 6వేల లీటర్ల పులుపును, డ్రమ్ములను, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పులుపును ధ్వంసం చేసి డ్రమ్ములను తగుల బెట్టారు. పోలీసులు రావడం చూసి తయారీదారులు పరారయ్యారని ఈ సందర్భంగా సీఐ అప్పలనాయుడు తెలిపారు.